ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

## ఇంద్రాదేవి ఆలయంలో పూజలు

ఇంద్రవెల్లి, జనవరి 7 : మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివారం ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడగాం, ముత్నూర్ గ్రామాలతోపాటు, ఆయా గ్రామాల ఆదివాసీ గిరిజనులు కుటుంబ సమేతంగా ఆలయానికి తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. మినప పప్పుతో నైవేద్యాలు తయారుచేసి, దేవికి సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అవరణలో వంటలు చేసి, సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై అసభ్య ప్రవర్తన

- ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై కేసు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 7 : మావల మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్‌పై కేసు నమోదైంది. ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై ప్రిన్సిపాల్ మోహన్ రావ్ అసభ్యకరమైన మాటలు, వెకిలి చేష్టలతో వేధిస్తున్నాడు. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

**ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి..**

విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ప్రిన్సిపాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని రిమాండ్‌కు తరలించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పాఠాలు చెప్పాల్సిన ప్రిన్సిపాల్ ఇలాంటి వేధింపులకు గురి చేయడం సిగ్గు చేటన్నారు. వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు.

## పల్లె ప్రకృతి వనాన్ని అందుబాటులోకి తేవాలి

ప్రహరీని చూపుతున్న జక్కుల వెంకటేశ్

బోథ్, జనవరి 7 : బోథ్‌లోని పల్లె ప్రకృతి వనాన్ని అందుబాటులోకి తేవాలని సామాజిక సేవకుడు, పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేశ్ అధికారులను కోరారు. బోథ్‌లోని ప్రకృతి వనం పరిసరాలను ఆదివారం సందర్శించారు. పక్కనున్న కేజీబీవీ ప్రహరీ కూలిపోవడం, వర్షాకాలంలో వచ్చిన వరద నీటితో దారి కోతకు గురైనట్లు పేర్కొన్నారు. పక్షులతోపాటు ప్రజలకు ఆహ్లాదాన్ని నింపేందుకు ఏర్పాటు చేసిన ప్రకృతి వనాన్ని ప్రజల సందర్శన కోసం అందుబాటులోకి తేవాలని కోరారు.

## నేడు, రేపు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ఇచ్చోడ, జనవరి 7 : ఇచ్చోడ, మన్నూర్ జిన్నింగ్‌లో పత్తి నిండుగా ఉండడంతో 8, 9వ తేదీల్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 10వ తేదీన యథావిధిగా కొనుగోళ్లు ఉంటాయని పేర్కొన్నారు.

# భవితకు నిలయాలు.. కేజీబీవీలు

విద్యార్థినులకు క్రాఫ్ట్ నేర్పిస్తున్న ఉపాధ్యాయురాలు

- చేతి వృత్తులపై విద్యార్థినులకు శిక్షణ
- సృజనాత్మక వస్తువుల తయారీపై బోధన
- ప్రతిభను వెలికితీసేలా కార్యక్రమాలు
- ఉపాధ్యాయుల చేయూత
- స్వయం ఉపాధిపై కేజీబీవీల్లో అవగాహన

ఇచ్చోడ, జనవరి 1 : విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కేజీబీవీల్లో చేతి వృత్తులపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వీటిలోని సృజనాత్మకతపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని 18 మండలాల్లో 17 కేజీబీవీలున్నాయి. ఇందులో 9 పాఠశాలల్లో క్రాఫ్ట్ ఉపాధ్యాయులు ఉన్నారు. అల్లికలు, కుట్లు, హోం డెకరేషన్‌కు సంబంధించిన విభాగాల్లో అవగాహన కల్పిస్తున్నారు. చదువు అనంతరం భవిష్యత్‌లో ఉపాధి చూపుతూ బాసటగా నిలుస్తున్నారు. యేటా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో చేతి వృత్తులపై విద్యార్థినులు ప్రదర్శన ఇస్తుండడంతో ఆసక్తి నెలకొంది.

ప్రస్తుత పోటీ ప్రపంచంలో వారికి విజ్ఞానంతోపాటు స్వయం ఉపాధి అవగాహన కల్పిస్తున్నారు. వృత్తి విద్య తరహాలో ప్రత్యేకంగా పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచే చేతివృత్తిలో నైపుణ్యం పొందితే భవిష్యత్‌లో ఆదాయ మార్గం సులువుగా ఉంటుందనే భావనతో నిర్వహిస్తున్నారు. ప్రధానంగా పేపర్ ఫ్లవర్స్, టేబుల్ క్లాత్, ఫ్లవర్ వాజ్ హ్యాండ్ బ్యాగ్స్, పర్సులు, ముత్యాల హారాలు, డిజైన్ గాజులు, ఫొటో ఫ్రేమ్‌లు, డోర్‌మ్యాట్స్, చిన్న పిల్లలకు గౌన్లు, జాకెట్లు, చేతి రుమాళ్ల వంటివి ఆకర్షణీయంగా తయారు చేసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థినులు తయారు చేసిన కళాకృతులను స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక స్టాళ్లలో ప్రదర్శిస్తున్నారు. కేజీబీవీ విద్యార్థినులు తయారు చేసిన కళాకృతులను నాటి కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డితోపాటు విదేశీయులు సైతం పరిశీలించి, విద్యార్థినులతోపాటు ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. కేజీబీవీల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా తర్ఫీదు ఇస్తున్నారు. చదువు అనంతరం స్వయం ఉపాధికి ఇది ఎంతగానో దోహదపడుతుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

విద్యార్థినులు తయారు చేసిన క్రాఫ్ట్

**విద్యతోపాటు చేతివృత్తుల్లో శిక్షణ..**

విద్యార్థినులకు ప్రభుత్వ సహకారం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెరుగైన విద్యతోపాటు చేతి వృత్తుల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. వారిలో సృజనాత్మకతను మెరుగుపర్చుకునేందుకు కేజీబీవీలోల చక్కని వేదికలు ఏర్పాటు చేసి అవకాశం కల్పిస్తున్నారు. వీటితో భవిష్యత్‌లో విద్యార్థులకు స్వయం ఉపాధి మార్గాలు కూడా సులువుగా లభించే అవకాశం ఉంటుంది. విద్యార్థినులు వాటి తయారీలో నైపుణ్యం సాధిస్తున్నారు. చేతి వృత్తుల తయారీలో అవగాహన వస్తున్నందున భవిష్యత్‌లో విద్యార్థినులకు ఎంతో ఉపయోగం ఉంటుంది.

**- జీ మల్లిక, కేజీబీవీ ప్రత్యేకాధికారి, ఇచ్చోడ**

**భవిష్యత్‌లో ఉపయోగపడ్తయ్..**

మా పాఠశాలలో క్రాఫ్ట్ మేడం ప్రతి రోజూ ఒక పీరియడ్ తీసుకుంటారు. మాకు అల్లికలు, ఎంబ్రాయిడరీ, పేపర్, దుస్తుల కట్టింగ్ ఎలాచేయాలో చెప్తున్నారు. ప్రాజెక్టు వర్క్ కూడా ఇస్తారు. దీంతో మాకు క్రాఫ్ట్‌పై నైపుణ్యం పెరుగుతుంది. మేము ప్రత్యేక రూమ్ ఏర్పాటు చేసి, తయారు చేసిన వస్తువులను అందులో ప్రదర్శిస్తాం. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే స్టాళ్లలో వాటిని ప్రదర్శిస్తాం. మాకు భవిష్యత్‌లో స్వయం ఉపాధికి ఉపయోగపడ్తయ్. అందరూ చాలా శ్రద్ధగా నేర్చుకుంటున్నారు.

**- మనీష, విద్యార్థి, ఎనిమిదో తరగతి**

# నేరాల కట్టడికే కార్డన్ సెర్చ్

- ఉట్నూర్ డీఎస్పీ నాగెందర్

మేడిగూడలో స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

నార్నూర్, జనవరి 7 : నేరాల కట్టడి కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని ఉట్నూర్ డీఎస్పీ నాగెందర్ అన్నారు. గాదిగూడ మండలం మేడిగూడ గ్రామంలో ఆదివారం నార్నూర్ సీఐ కే ప్రేమ్‌కుమార్, ఎక్సైజ్ సిబ్బంది ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సోదాలు చేశారు. అలాగే నంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు లేని 12 ఆటోలు, 53 బైకులను స్వాధీనం చేసుకున్నారు. గుల్వే రాహుల్ ఇంట్లో 10 లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలను అప్రమత్తం చేయడమే కార్డన్ సెర్చ్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గాదిగూడ ఎస్ఐ మహేశ్, నార్నూర్ ఎస్ఐ రవికిరణ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**యువకులకు వాలీబాల్ కిట్ అందజేత..**

గాదిగూడ మండలం దాబా(కే)గ్రామంలోని యువతకు పోలీసుల ఆధ్వర్యంలో డీఎస్పీ వాలీబాల్ కిట్ అందజేశారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలతో పాటు, చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా పోలీస్‌ల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కరించేందుకు పోలీస్‌ల సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.

## 14 నుంచి వైభవ్ సల్మాన్ స్మారక క్రికెట్ పోటీలు

తాంసి(భీంపూర్), జనవరి 7 : భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామానికి చెందిన ప్రాణ స్నేహితులు గొల్లి వైభవ్ యాదవ్, సల్మాన్ కొద్ది నెలల క్రితం మహారాష్ట్ర చికల్‌ధారి వద్ద కారు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా, వారి స్మారకార్థం అర్లి గ్రామానికి చెందిన చైతన్య యువజన సంఘం ఈ నెల 14 నుంచి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతిగా రూ.25 వేలను కొలాం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టెకాం దిలీప్, రెండో బహుమతిగా రూ.12 వేలను వైభవ్ తల్లిదండ్రులు సర్పంచ్ గొల్లి రామాబాయి లస్మన్న, మూడో బహుమతిగా రూ.7500 రానున్న, నాలుగో బహుమతిగా రూ.5 వేలు ఎంపీటీసీ స్వప్న రాకేశ్ ఇవ్వనున్నారు. భారే తేజ్‌రావ్, మాదస్తు సురేందర్ ఈ టోర్నీలో ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు.

## రైతులకు పరిహారం అందించాలి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 7 : ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు విషయంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించాలని డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి అన్నారు. బాధిత రైతులు ఆదివారం ఆయనను కలిసి, సమస్య విన్నవించారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

## బోనాల జాతరలో ఎమ్మెల్యే

బోథ్, జనవరి 7 : మండలంలోని కౌఠ(బీ) గ్రామంలో ఆదివారం కోమురవెల్లి మల్లన్న స్వామి బోనాల జాతరలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. హనుమాన్ ఆలయం నుంచి పాదయాత్ర ద్వారా మల్లన్న స్వామి ఆలయానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐతారం ముచ్చట్లు

ఐతారం ముచ్చట్లలో పాల్గొన్న కవులు, రచయితలు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 7 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో ఆదివారం కవులు, రచయితలు ఐతారం ముచ్చట్లు నిర్వహించారు. స్వీయ కవితలు, పాటలు వినిపించారు. కొన్ని తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో ఇందిరా దేవేందర్, సాయిప్రియ, శైలజ, త్రివేణి, యూ గంగన్న, డాక్టర్ ఉదారి నారాయణ, కమ్మల నర్సింలు, బాబన్న, రిజ్వాన్, లక్ష్మీనారాయణ, నిమ్మల ప్రశాంత్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 7 : పట్టణంలోని అంబేద్కర్ భవనంలో బోధి బుడోకాన్ కరాటే సీనియర్ మాస్టర్ కాంబ్లే ముకేశ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 180 మంది హాజరయ్యారు. వీరిలో 66 మంది ఎల్లో బెల్ట్, 37 మంది ఆరెంజ్ బెల్ట్, 24 మంది గ్రీన్ బెల్ట్, 18 మంది బ్లూ బెల్ట్, 16 మంది పర్పుల్ బెల్ట్, 19 మంది బ్రౌన్ బెల్ట్ సాధించారు.

## యువరైతు ఆత్మహత్య

బోథ్, జనవరి 7 : మండలంలోని బాబెర గ్రామానికి చెందిన ఆత్రం భీమ్‌రావ్(25) యువరైతు పురుగుల మందు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రాము తెలిపారు. భీంరావ్ తనకున్న నాలుగెకరాల్లో పత్తి సాగు చేశాడు. ఆశించిన దిగుబడి రాకపోవడంతో మనోవేదనకు గురై, శనివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బోథ్ దవాఖానకు, అనంతరం రిమ్స్‌కు తరలిస్తుండగా, మార్గ మధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఇష్టమైన రంగాల్లో రాణించాలి

విద్యార్థినికి నగదు అందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఉట్నూర్, జనవరి 7 : విద్యార్థులు, యువత ఇష్టమైన రంగాల్లో రాణించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సూచించారు. చాలెంజ్ డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందిన మండలంలోని విద్యార్థినులు హర్షిత, ఆరాధ్య మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే డ్యాన్స్ అకాడమీకి ఎంపికయ్యారు. వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే తన నివాసంలో ఆదివారం ఆ విద్యార్థులకు రూ.30వేలు అందించారు. ప్రతిభకు పేదరికం అడ్డురావద్దన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లితండ్రులుఉన్నారు. పాత ఉట్నూర్‌లోని పర్దాన్‌గూడ కాలనీవాసులు ఎమ్మెల్యేకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తూనే విద్య, వైద్యం అందించడంలో అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పర్దాన్ కులపెద్దలు, కాలనీవాసులు ఉన్నారు.

## శబరి యాత్రకు దీక్షాపరులు

శబరిమలై వెళ్తున్న అయ్యప్ప దీక్షాపరులు

బోథ్, జనవరి 7 : మండలంలోని మర్లపల్లి గ్రామానికి చెందిన అయ్యప్ప దీక్షాపరులు ఆదివారం అనిల్ అప్ప గురుస్వామి ఆధ్వర్యంలో శబరి మలై యాత్రకు బయల్దేరారు. శబరిమలై బయల్దేరిన వారిలో లాడేవారి నిఖిల్, రవీందర్, అరవింద్, సిరిసే సాయి, కోలారి దత్తు, రాథోడ్ సికందర్, సందీప్, రమేశ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హాంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## గడపగడపకూ రామయ్య అక్షింతలు


బోథ్ : అక్షింతలు పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

ఉట్నూర్ : అక్షింతలు అందిస్తున్న సభ్యులు

ఉట్నూర్, జనవరి 7 : మండల కేంద్రంలో ఆదివారం అయోధ్య రామయ్య అక్షింతలను గడపగడపకూ పంపిణీ చేశారు. పట్టణంలోని శాంతినగర్, బోయవాడ, మెయిన్‌రోడ్, శివాజీనగర్ కాలనీల్లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు, వీహెచ్‌పీ సభ్యులు, ఉట్నూర్ హిందూ ఉత్సవ సమితీ సభ్యులు, వివిధ ఆలయ కమిటీల సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

**బోథ్‌లో..**

బోథ్, జనవరి 7 : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బోథ్‌లో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులతో వచ్చి అక్షింతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి పాలిక్ రమేశ్, వీ శ్రీనివాస్, అనిల్‌కుమార్, సాయికుమార్, రాము, ఎర్రోళ్ల సతీశ్, కిష్టయ్య, జటాల శివకుమార్, శ్రీధర్, శైలేందర్ పాల్గొన్నారు.

ఇచ్చోడ, జనవరి 7 : మండలంలోని ముక్రా(బీ)లో అక్షింతల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి గ్రామస్తులు, మహిళలు ఊరేగింపుగా తరలివచ్చారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. సనాతన ధర్మ సేవా సమితి యూత్ ముక్రా(బీ) సర్పంచ్ ఏ మారుతి, మరజ్, దేవురావ్, సంతోష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

## కౌఠ (బీ)లో మల్లన్న భోనాలు

బోథ్, జనవరి 7 : కౌఠ (బీ) గ్రామంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో మల్లన్న స్వామి భోనాలు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల నడుమ గ్రామంలో భోనాలతో ఊరేగింపు చేపట్టారు. హనుమాన్, శబరిమాతాజీ, పోచమ్మ, బ్రహంగారి ఆలయాల్లో పూజలు చేశారు. భోనాలు సమర్పించారు. అనంతరం మల్లన్న స్వామి చిత్రపటాలకు పూజలు చేశారు. ఉత్సవ మూర్తుల విగ్రహాలు, పాదుకలను ఊరేగించారు. సాయంత్రం పట్నాలు వేశారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో గ్రామస్తులంతా సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీమంతుల శ్రీనివాస్, పోతన అర్జున్, సాయన్న, బక్కన్న, వెంకటస్వామి పాల్గొన్నారు. వివిధ గ్రామాల మల్లన్న భక్తులు హాజరయ్యారు.

## అంగడి బజార్ ప్రారంభం

జైనథ్, జనవరి 7 : మండలంలోని సాంగ్వి(కే) గ్రామంలో ఆదివారం అంగడి బజార్‌ను సర్పంచ్ విఠల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఆదివారం సంతలో కూరగాయలు, పండ్లు, పనిముట్లు, ఎడ్లు, మేకలు, కోళ్లు, చేపలు, ఇతరాత్ర వస్తువులను విక్రయించుకోవచ్చన్నారు. కురె అశోక్, రౌత్ పోచిరాం, తరుణ్, కూరె పోచ్చన్న, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లేజర్ టెక్నాలజీ యంత్రం ప్రారంభం

ఎదులాపురం, జనవరి 7 : జిల్లా కేంద్రంలోని రిమ్స్ దవాఖానలో ఆదివారం శస్త్ర చికిత్స అవసరం లేకుండా లేజర్ టెక్నాలజీతో కిడ్నీలో రాళ్లను తొలగించే యంత్రాన్ని ఎంపీ సోయం బాపురావ్‌తో కలిసి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో అన్ని రకాల చికిత్సలు అందుతున్నాయన్నారు. రూ.150కోట్లతో సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మించినట్లు, త్వరలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు, సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

**ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ ..**

జైనథ్(బేల), జనవరి 7 : బేల మండలం ఉపాసనాల గ్రామంలో ఐటీడీఏ నిధుల ద్వారా నిర్మించనున్న 10 ఇండ్లకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో అధికారులు, బీజేపీ మండలాధ్యక్షుడు దత్తా నిక్కం, నాయకులు సంజయ్, నవీన్, రాము, బర్కడే, జీవన్, సందీప్, ఠాక్రే, ప్రమోద్ రెడ్డి, ప్రదీప్ ఖోడే పాల్గొన్నారు.

**గాండ్ల సంఘం ఆత్మీయ సమ్మేళనం..**

ఆదిలాబాద్ రూరల్, జనవరి 7 : జిల్లాకేంద్రంలోని ఎస్టీయూ భవనంలో అఖిల గాండ్ల తేలికుల సంఘం జిల్లా ఆత్మీయ సమ్మేళన సభ వైభవంగా నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, నాయకులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, దుర్గం శేఖర్, గాండ్ల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పిన్నాం వార్ రాకేశ్, ప్రధాన కార్యదర్శి తమ్మల్లవార్ చందు హాజరయ్యారు.

యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ సోయం బాపురావ్

## బోథ్ కమిటీ ఎన్నికలు 9న

బోథ్, జనవరి 7 : ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ బోథ్ మండల కమిటీ ఎన్నికలను ఈ నెల 9న స్థానిక షాదిఖానలో నిర్వహిస్తున్నట్లు బోథ్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు దుర్వ విశ్వేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని పట్నాపూర్, మేడిగూడ, నక్కలవాడ, కొత్తపల్లె, రేండ్లపల్లె, మర్లపల్లి, ఇన్కర్‌పల్లె గ్రామాల్లో ఆదివారం పర్యటించి, గ్రామ పటేళ్లు, సర్పంచులు, యువజన సంఘాల వారికి ఆహ్వాన పత్రాలు అందించారు. ఆదివాసీ యువకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మహిళలు హజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు కుర్మె రాజన్న, జిల్లా ఉపాధ్యక్షుడు రామెల్లి భోజన్న, పంద్రం శంకర్, కొడప విజయ్, గొడం జుగధిరాశ్, కనక అమృత్‌రావు, తొడసం గోపాల్ పాల్గొన్నారు.

పట్నాపూర్‌లో ఆహ్వాన పత్రం అందజేస్తున్న డివిజన్ కమిటీ నాయకులు

## బోథ్‌లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి


మంత్రికి మొక్క అందజేస్తున్న అరుణ్‌కుమార్

బోథ్, జనవరి 7 : బోథ్‌లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని కోరుతూ ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏఐసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కో-ఆరిడనేటర్ తుల అరుణ్‌కుమార్ విన్నవించారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కలిసి, పూలమొక్క అందించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయం సీఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.